జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 6-1-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 559 పేజీలు: 4 వెల : రూ.7

## ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే..
# రైతుల ఖాతాల్లోనే నగదు జమ

* గత ప్రభుత్వ బకాయిలను మేమే తీర్చాం
* రాష్ట్ర వ్యాప్తంగా 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
* ఆరు లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.9300 కోట్లు జమ
* రైతులకు ఉచితంగా టార్పాలిన్లు
* పట్టణాల్లో రూ.20లకే కిలో గోధుమపిండి
* 34 వేల పాఠశాలలు, 4వేల సంక్షేమ హాస్టళ్లకు సన్నబియ్యం
* రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
* రైతులతో ముఖాముఖి
* ధాన్యం సేకరణ కేంద్రాలు, మిల్లులు, గోదాముల తనిఖీ





**శ్రీకాకుళం, జనవరి 5(వార్త):** రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నామని, రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. సోమవారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటించిన ఆయన పలు ధాన్యం సేకరణ కేంద్రాలను, గోదాములు, రైస్ మిల్లులను తనిఖీ చేసి, రైతులతో ముఖాముఖి మాట్లాడారు. మంత్రి తన పర్యటనలో భాగంగా తొలుత అరసవెల్లిలోని మండల స్థాయి పౌరసరఫరాల గోదామును తనిఖీ చేశారు. అక్కడ అంగన్‌వాడీ కేంద్రాలకు, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసేందుకు సిద్ధంగా సరుకులను పరిశీలించారు. అనంతరం గార మండలం రామచంద్రాపురంలోని శ్రీనివాస రైస్ మిల్లును సందర్శించి మిల్లర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం సేకరణపై రామచంద్రాపురం పరిసర గ్రామాల్లో రైతులతో ముచ్చటించారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన సుమారు రూ.1674 కోట్ల ధాన్యం బకాయిలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే పూర్తిగా చెల్లించి రైతులను ఆదుకున్నామని మంత్రి తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెలలోనే రూ.1000 కోట్లు, రెండో నెలలో మిగిలిన రూ.674 కోట్లు విడుదల చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలును లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 38 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ పూర్తయిందని తెలిపారు. దీని ద్వారా సుమారు 6 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 9,300 కోట్లను కేవలం 24 గంటల్లోనే జమ చేశామని వివరించారు.

ఇక శ్రీకాకుళం జిల్లా విషయానికొస్తే.. 6.50 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యానికి గానూ ఇప్పటివరకు 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, రూ.1200 కోట్లను రైతుల ఖాతాలకు చేరవేశామన్నారు. జిల్లాలో మిగిలిన 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరుగుతుందని తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియలో రైతులకు, మిల్లర్లకు, హమాలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు. సిమ్మపేట గ్రామంలో జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రైతులకు ఉచితంగా టార్పాలిన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పట్టణాల్లో ప్రయోగాత్మకంగా రూ.20కే కిలో గోధుమపిండి అందిస్తున్నామని తెలిపారు. స్పందనను బట్టి ఈ పథకాన్ని గ్రామాలకు విస్తరిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 34 వేల పాఠశాలలు, 4 వేల సంక్షేమ హాస్టళ్లకు సన్నబియ్యాన్ని సరఫరా చేస్తున్నామని గుర్తుచేశారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కృషితో ఈ ప్రాంత సమస్యలు పరిష్కారమవుతున్నాయని కొనియాడారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ తుపాను ప్రభావంతో ఇబ్బందులు ఎదురైనప్పటికీ, పక్కా ప్రణాళికతో ధాన్యం సేకరణను వేగవంతం చేశామని వివరించారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ గతంలోలా వాహనాల కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండా, 15 రోజుల్లో ఎప్పుడైనా రేషన్ తీసుకునే వెసులుబాటు కల్పించామని పేర్కొన్నారు.



### నైరాలో రైతులతో ముఖాముఖి..

శ్రీకాకుళం రూరల్ మండలం నైరా గ్రామంలో రైతులతో రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖాముఖి చర్చించారు. మిల్లుల వద్ద సమస్యలు, బ్యాంక్ గ్యారంటీలు, ట్రక్ షీట్ తయారీ, పంటల దిగుబడి గురించి తదితర విషయాలపై రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ ఎండీ సేనాపతి ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఆర్డీవో సాయి ప్రత్యూష, జిల్లా పౌర సరఫరాల అధికారి జి. సూర్య ప్రకాశరావు, మేనేజర్ వేణుగోపాల్, అగ్రికల్చర్ జెడి త్రినాధరావు, వంశధార ప్రాజెక్ట్ చైర్మన్ ఏ రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల మాదిరి.. దూరం నుంచే..
# ఆదిత్యుని దర్శనం

* భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు
* కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్
* ఎస్పీతో కలిసి రథసప్తమి వేడుకల ఏర్పాట్ల పరిశీలన

**అరసవల్లి, జనవరి 5 (వార్త):** తిరుమల దేవస్థానంలో మాదిరిగా స్వామివారిని ఫర్లాంగు దూరం నుంచే భక్తులు ప్రత్యక్షంగా దర్శించే విధంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానంలోనూ ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకల ఏర్పాట్లను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఆలయాధికారులతో కలిసి పరిశీలించారు. ఆలయ ఈవో ప్రసాద్, ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఉచిత దర్శనం, వీఐపీ దర్శనం, వికలాంగుల దర్శనాలకు వేర్వేరుగా ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. క్యూ లైన్‌లో బారికేడ్లను నిర్మించాలని సూచించారు. క్యూలైన్ల మధ్యలో కార్పెట్లు, షామియానాలు ఏర్పాటు చేసి, రోలింగ్ మెష్‌లు, పైపులు, బారికేడ్లు పటిష్టంగా అమర్చాలని, తోపులాటలకు ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రథసప్తమి సందర్భంగా వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్‌కు 80 రోడ్ల వద్ద, హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ సమీపంలో ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రత్యేక ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేసి, 108, 104 అంబులెన్స్ వాహనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ సామాన్య భక్తులు దర్శనానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీ కరణ, వాహనాలు పార్కింగ్ ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులు ఆశిం చారు. క్యూ లైన్లు సక్రమ నిర్వహణ, పటిష్ట చర్యలతో భక్తులకు ప్రశాంతంగా స్వామి వారి దర్శనం కల్పిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. వారి వెంట రథసప్తమి వేడుకల ఫెస్టివల్ స్పెషల్ ఆఫీసర్ శోభారాణి, డీఎస్పీ వివేకానంద, సూడా ఈఈ సుగుణాకర్‌రావు, శ్రీకాకుళం రూరల్ సీఐ పైడిపు నాయుడు, ఎస్సై హరికృష్ణ, పోలీసు అధికారులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.





## క్రైం వార్తలు

### యువకుడు ఆత్మహత్యాయత్నం

**శ్రీకాకుళం క్రైం, జనవరి 5 (వార్త):** యజమానికి డబ్బులు అడిగితే ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బూర్జ మండలం కొల్లివలసలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తురకపేటకు చెందిన వెంకటేష్ అనే యువకుడు కొల్లివలసలోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. అవసరం మేరకు డబ్బులు కావాలని యజమానిని సోమవారం వెంకటేష్ అడిగాడు. అయితే తనకు తెలియజేయకుండా మూడు రోజులుగా రూ.18వేలు ఎందుకు ఖర్చు చేశావని యజమాని.. యువకుడిపై కేకలు వేశాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. దీన్ని గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో శ్రీకాకుళం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బూర్జ ఎస్ఐ ప్రవల్లిక తెలిపారు.

### పుస్తెలతాడు చోరీ

ఆమదాలవలస మండలం చంద్రయ్యపేట పేరంటాల వీధిలో నివాసముంటున్న కరణం సుజాత మెడలో ఉన్న పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తి తెంపుకొని పోయిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఆమదాలవలస పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం సుజాత ఆసుపత్రికి వెళుతుండగా వెనుక నుండి గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల పుస్తెలతాడును లాక్కొని పారిపోయాడు. ఆమె కేకలు వేయగా చుట్టుపక్కల వారు అక్కడికి చేరారు. అప్పటికే అగంతకుడు పారిపోయాడు. బాధితురాలు సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సనపల బాలరాజు తెలిపారు.

### వానర, భైరవ స్నేహం

**మందస, జనవరి 5(వార్త):** పుట్టుకతోనే వానరానికి, శునకానికి జాతి వైరం. వానరం కనిపిస్తే చాలు కుక్కలు వెంబడించి మరీ తరుముతాయి. కుక్కల గుంపుతో వానరంపై దాడి చేస్తాయి. అటువంటి సంఘటనలు ఎన్నో చూసినా.. నేడు జాతి వైరం కలిగిన ఈ రెండు జంతువులు ఎంతో స్నేహంగా ఉంటూ ఆకట్టుకుంటున్నాయి. మందస మండలంలోని వీరగున్నమ్మపురం (గుడారిరాజమణిపురం) పోరాటాలకు పుట్టినిల్లు. సాసుమాన గున్నమ్మ (వీరగున్నమ్మ) తెల్లదొరలపై కత్తులతో పోరాట పటిమ చూపిన గ్రామమది. ఈ గ్రామంలో కోతుల గుంపు తయారయ్యింది. తరచూ కుక్కలు వీటిని వెంటబెడుతున్నప్పటికీ, చెట్లపై ఆవాసాలు ఏర్పచుకుని, గ్రామంలో అలజడి సృష్టిస్తున్నాయి. కానీ, ఓ వానరం, శునకం స్నేహంగా కనిపించాయి. దీంతో దోస్త్ మేరా దోస్త్ అంటూ కలివిడిగా ఉంటున్నాయి. ఈ నోరులేని మూగ జంతువులు మాత్రం స్నేహంతో జీవించి, మానవులకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.



## 7న కొత్తూరులో మెగా జాబ్ మేళా

**కొత్తూరు, జనవరి5 (వార్త):** నిరుద్యోగ యువతీ యువకులు ఈ మెగా జాబ్ మేళాను సద్వినియోగపరచుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొత్తూరులోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 7న ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందన్నారు. ఈ మేళాలో టాటా ఎలక్ట్రానిక్స్, డెక్కన్ ఫైన్ మికల్స్, ముత్తూట్ ఫిన్ కార్ప్, నవత రోడ్ ట్రాన్స్పోర్ట్, ఎల్అండ్‌టీ, ఫైనాన్స్, ఎన్ఎస్ ఇన్స్ట్రుమెంట్స్‌తో కలుపుకొని సుమారు 10 ప్రైవేట్ కంపెనీలు పాల్గొని సుమారు 350 ఖాళీలకు నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, చదివిన 18 నుండి 30 ఏళ్ల మధ్య వయసున్న నిరుద్యోగ యువతి యువకులు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయిన వారికి శ్రీకాకుళం, విశాఖపట్నం, తుని, రాజమండ్రి, శ్రీ సిటీ నెల్లూరు, హైదరాబాద్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, రిఫరెన్స్ నంబర్, రెజ్యూమే, ఆధార్, విద్యార్హతల ఒరిజినల్స్, జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో కలిసి ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రాంగణానికి రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 6301045132 నెంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ చెప్పారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# బాలికల హాస్టల్‌లో గణిత అవధానం



**సోంపేట, జనవరి 5(వార్త):** సోంపేటలో గల సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో సోమవారం ప్రముఖ గణిత అవధాని మద్దు తిరుపతిరావు మాస్టారు గణిత అవధానాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు గణ తంలో మరింత ధైర్యం కల్పిస్తూ అవధానం ద్వారా గణిత చిట్కాలను సులభ శైలిలో వివరించారు. వసతి గృహ అధికారిణి ఎస్.విజయలక్ష్మి అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమం ఆద్యంతం విద్యార్థు లను ఎంతో అబ్బురపరిచింది. గణితంలో ఘన మూలాలు, సమస్య పురాణం, పంచమ మూలా లు, మనోసంకలనం, దత్త భిన్నాంకం తదితరా లపై ప్రొచ్ఛకులుగా విద్యార్థులు అడిగిన అంశా లకు అవధాని తిరుపతిరావు చెప్పిన సమాధా నాలు ఎంతో ఆసక్తి కలిగించాయి. గణితంలో తమాషా కథలు మెదడుకు పదును మెదడుకు మేత మొదలైన మెళకువల గూర్చి అవధాని వివరించారు. ఈ సందర్భంగా అవధాని తిరుపతిని సత్కరించారు.

## శారదాపురంలో రీ సర్వే ప్రారంభం



**సోంపేట, జనవరి 5(వార్త):** శారదాపురంలో భూముల రీ సర్వే సోమవారం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ, సర్వే సిబ్బంది భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులందరికీ న్యాయం జరిగేలా రి సర్వే కార్యక్రమం అంకితభావంతో సకాలంలో పూర్తి చేయాలని కోరారు. గతంలో రీసర్వే పూర్తయిన రైతులకు ప్రభుత్వం రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు అందజేస్తుందన్నారు. ఈ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. భూముల డాక్యుమెంట్లను సర్వే సిబ్బందికి చూపించడంతోపాటు వారి కమతాల హద్దులను కూడా చూపించి, సర్వే చేయించుకోవాలని కోరారు.

## పీజీటీ దరఖాస్తుకు గడువు పొడిగింపు

**సోంపేట, జనవరి 5(వార్త):** ప్రభుత్వ ఆదర్శ పాఠశాలల్లో అతిథి బోధనా సిబ్బంది నియామకాలకు దరఖాస్తు గడువును ఈనెల 8వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు పొడిగించినట్లు సోంపేట ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. సోంపేట మోడల్ పాఠశాలలో కెమిస్ట్రీ సబ్జెక్టుకు అర్హత కలిగిన అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హతలు, ఇతర వివరాల కోసం స్వయంగా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ సంప్రదించాలని కోరారు.

## అలుగోలు, సింహాద్రి కుటుంబాలకు పిన్నింటి పరామర్శ



**జి.సిగడాం, జనవరి 5(వార్త):** పెంట గ్రామంలో కెమిస్ట్రీ లెక్చరర్ అలుగోలు సురేష్ తల్లి సీతారత్నం, సౌమ్య ఎంటర్‌ప్రైజెస్ యాజమాని సింహాద్రి విజయశంకర్ కుమారుడు శరత్‌చంద్ర ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసున్న ఎచ్చెర్ల వైసీపీ సీనియర్ నేత పిన్నింటి సాయికుమార్ ఆ కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట ఏఎంసీ ఉపాధ్యక్షుడు బూరాడ వెంకటరమణ, సర్పంచ్ సాకేటి నాగరాజు సర్పంచ్ ప్రతినిధి పున్నాన అక్కలనాయుడు, ఎంపీటీసీ ప్రతినిధి మక్క శ్రీనివాసరావు గ్రామస్తులు పున్నాన పాపినాయుడు, కుటుంబసభ్యులు సింహాద్రి సూర్యనారాయణ ప్రదీప్‌కుమార్, ఆనందరావు, అలుగోలు రాజశేఖర్, సుధాకర్, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, తామరాపల్లి సుధీర్ తదితరులు ఉన్నారు.

## పేదలకు అన్నదానం



**మందస, జనవరి 5(వార్త):** సిక్కోలు ఉద్దానం సేవా సమితి ఆధ్వర్యంలో పేదలు, అనాథలు, భిక్షకులకు అన్నదానం కొనసాగుతోంది. సిక్కోలు ఉద్దానం సేవా సమితి సభ్యులు విశ్వేశ్వరరావు, రాజేష్, శ్రీనివాసరావు, ఎర్రన్న, పాపారావు, ఢిల్లీరావు, వెంకటరావు, రాజేష్‌బాబు, రాజు, జగన్నాథరావు. లక్ష్మ సహకారంతో రోడ్డుపై ఉండే అనాథలు, అభాగ్యులకు సోమవారం అన్నదానం చేశారు. సిక్కోలు ఉద్దానం సేవా సమితి చేస్తున్న దాతృత్వంపై ప్రజలు అభినందలు తెలుపుతున్నారు. ఎవరివైనా పెళ్లి రోజులు, పుట్టిన రోజులు, ఇతర శుభసందర్భాలలో అనవసర వ్యయం చేయకుండా ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టాలని సిక్కోలు ఉద్దానం సేవా సమితి ప్రతినిధులు కోరారు. జిల్లాలో ఎవరికైనా అంబులెన్సు సర్వీస్ కావాలంటే సిక్కోలు ఉద్దానం సేవా సమితి (7207119285)ని సంప్రదించాలని వారు కోరారు.

## తాపీమేస్త్రి సంఘం అధ్యక్షుడిగా ఆదినారాయణ



**సోంపేట, జనవరి 5(వార్త):** సోంపేట తాపీమేస్త్రిల సంఘం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన కోర్నాన ఆదినారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా తట్ట నారాయణ, సంయుక్త కార్యదర్శిగా జెర్రి శేఖర్, కోశాధికారిగా పొందూరు బాలరాజు, సహ కోశాధికారిగా మండల కూర్మారావు ఎన్నికయ్యారు. ఆదినారాయణ సీనియర్ తాపీ మేస్త్రిగా అందరికీ సుపరిచితుడు. ఆదినారాయణతో పాటు కార్యవర్గ సభ్యుల ఎన్నికను సభ్యులంతా ఆమోదించడంతో ఏకగ్రీవమైంది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సోంపేట నిమ్మశినమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీ కోదండరామ ఆలయ కమిటీ చైర్మన్ బీన ఆనంద్, పొందూరు రాజు, బీన ఈశ్వరరావు, కాంచన రాఘవదాసు తదితరులు అభినందించారు.

## మండల ప్రతిభా పరీక్షలో రేష్మకు ద్వితీయ స్థానం

**జలుమూరు, జనవరి 5 (వార్త):** కరవంజ గ్రామ ప్రజా గ్రంథాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో అల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.రేష్మ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా సోమవారం హెచ్‌ఎం రామకృష్ణ విద్యార్థిని రేష్మను అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షంచారు. రేష్మను తీర్చిదిద్దిన టీచర్ నందిగాం రాజగోపాల్‌ను కూడా ఆయన అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు రేష్మకు శుభాకాంక్షలు తెలిపారు.



# ఉపాధి'కి కొత్త రూపు

**-వీబీజీ..రామ్‌గా మార్పు**

**- పనిదినాలు 100 నుంచి 125కు పెంపు**

**-ఎంపీడీవో జి.రామకృష్ణారావు**

**- ప్రజలకు అవగాహన కల్పించనున్న అధికారులు**



**జి.సిగడాం, జనవరి 5(వార్త):** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం రూపుమారుతోంది. కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్' పేరుతో పథకం అమలుకు శ్రీకారం చుడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అదేశాల మేరకు మండల వ్యాప్తంగా సోమవారం ఎంపీడీఓ జి.రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఏపీవో చోళ్ల సత్యనారాయణ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులందరూ సమక్షంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాండ్రంగిలో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, ఏపీవో మాట్లాడుతూ మండలంలో వేతనదారులు 27536 మంది వీరిలో అధార్ సీడ్ చేసినవి 27497మంది ఈ కేవైసీ చేసినవి 22182మంది పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని వీబీ జీ-రామ్ జీగా మార్చిన నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించాలని కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలిచ్చిందని, ఈ పథకంలో మార్పులను అధికారులు వివరించారు. నాలుగు అంశాలకు సంబంధించి పనులకు అధిక ప్రాధాన్యం ఉంటుందని అవి జలసంరక్షణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, జీవనోపాధుల కల్పన, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే పనులు. గ్రామాల అభివృద్ధి ఎక్కువగా ఉపాధి హామీ పథకంపైనే ఆధారపడి ఉంటోందని, అందులో భాగంగా కొత్తగా 266 పనులు చేపట్టేందుకు మార్గం సుగమం కానుందని. సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం... పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు కొత్త భవనాల నిర్మాణం నిధులతోనే చేపట్టనున్నారు. బంజరు, బీడు భూముల్లో పండ్ల తోటలు, మొక్కల పెంపకంతో పాటు పండ్ల తోటలు, వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణానికి ఈ కొత్త పథకం ద్వారా నిధులు మంజూరు కానున్నాయని తెలిపారు.. గ్రామసభల్లో ప్రధాన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షులు బురాడ వెంకటరమణ, సర్పంచ్ సాకేటి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి వడగ గౌరీశంకరరావు, సచివాలయ సిబ్బంది, ప్రజలు, వేతనదారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# చదువు ఒక్కటే సమాజాన్ని మార్చగలదు

**-సామాజిక నైతాళికురాలు సావిత్రి భాయి పూలే -పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష**

**- యూటీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం - ఉపాధ్యాయినిలకు సన్మానం**



**మందస, జనవరి 5(వార్త):** చదువు ఒక్కటే సమాజాన్ని మార్చగలదని, ఎందరో మహానుభావులు విద్యతోనే సామాజిక చైతన్యం తీసుకువచ్చారని పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష అన్నారు. హరిపురంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక నైతాళికురాలు సావిత్రి భాయి పూలే సేవలు ఆదర్శనీయమన్నారు. తల్లిగా, చెల్లిగా, గృహిణిగా ఉంటూ సమాజాన్ని ఉద్ధరించే ఉపాధ్యాయ వృత్తిని పటిష్టంగా నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులను సన్మానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్, జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు ప్రధాన వక్తలుగా హాజరై, బాలికల విద్య ద్వారా సాంఘిక దురాచారాల చెర నుంచి బయటపడవచ్చునని విశ్వసించి, కార్యాచరణ ప్రారంభించి, కుల వ్యవస్థ నిర్మూలనకు మహిళల అక్షరాస్యత ఒక్కటే మార్గం అని నమ్మి, తన భర్త ప్రోత్సాహంతో బాలికల పాఠశాలలను ఏర్పాటు చేసారని అన్నారు. మండల విద్యాశాఖ అధికారి-2 ఎం.భాస్కరరావు, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు బి.ధనలక్ష్మ ముఖ్య అతిథులుగా హాజరై ఆనాడు సావిత్రి భాయి పూలే ప్రారంభించిన బాలికా విద్య నేటికీ అందరికీ అందుబాటులోకి రావడం హర్షనీయమని, ఇటువంటి పరిస్థితుల్లో ఏ ఆశయాలు కోసం సావిత్రి భాయి పూలే తన జీవితాన్ని ధారబోసిందో, ఆ లక్ష్య సాధన కోసం నేటి మహిళా ఉపాధ్యాయినిలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. మహిళా ఉపాధ్యాయినిలు కార్యోన్ముఖులై బాలికా విద్య కొరకు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గుంటి గిరిధర్ కోరారు. మండల స్థాయి సమావేశంలో 90మహిళా ఉపాధ్యాయినిలు పాల్గొని ఎమ్మెల్యే గౌతు శిరీష చేతుల మీదుగా దుశ్శా లువ, పూల మొక్కలతో సన్మానాన్ని పొందారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిలు జయరాంమాలి, కంచరాన రమేష్, మందస మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీష్ బడిత్య, దాసరి ఈశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా పూర్వపు కార్యదర్శులు గున్న రమేష్, రాజాన పరమేశ్వర రావు, మండల పూర్వపు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.కొండలరావు, దుర్గాప్రసాద్ పాణిగ్రహి, సార భాస్కరరావు, కొర్ల సోమేశ్వరరావు, సహాధ్యక్షులు డి.కిరణ్, ప్రియాంక మహారాణా, మండల కౌన్సిలర్లు లండ రాజారావు, తరిణి సోమేశ్వరరావు, గున్న రాజు, గున్న చంద్రశేఖర్, మండల కార్యదర్శులు కుత్తం సుధాకర్, పాలిన సాయికుమార్, బండి చంద్రశేఖర్, కూటమి నాయకులు, మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, యుటిఎఫ్ జిల్లా, మండల కార్యకర్తలు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తులో పాల్గొన్నారు. అనంతం ఎంఎల్ఏ శిరీష పలు కుటుంబాలను పరామర్శించారు.

## పలువురిని పరామర్శించిన సీదిరి

**పలాస, జనవరి 5(వార్త):** మాజీ మంత్రివర్యులు డాక్టర్ సీదిరి. అప్పలరాజు సోమవారం పలు పరామర్శ కార్యక్రమంలో భాగంగా పలాస మండలం మామిడిమెట్టు పంచాయతీ రంగోయి గ్రామంలో గేదెల.దేవరాజు ఆకస్మిక మరణంతో వారి కుటుంబాన్ని, తామడ.మహేష్ మాస్టర్ నాన్న బీమారావు మరణించడంతో వారి కుటుంబాన్ని, అదే గ్రామానికి చెందిన కొత్తపల్లి.షణ్ముఖ అన్నయినా మనోహర్ ఆకస్మిక మరణంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే గురుదాసుపురం పంచాయతీ రామకృష్ణాపురం గ్రామానికి చెందిన లండ.శశికుమార్ ఆకస్మిక మరణం తో వారి కుటుంబాన్ని,అలాగే పెదంచల పంచాయతీ మరదరాజపురం గ్రామానికి చెందిన సింహాచలం మిశ్రా వారి అమ్మగారు మరణించడం తో వారి కుటుంబానికి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గెదల లక్ష్మ సూర్య, పలాస మండల పార్టీ అధ్యక్షుడు దువ్వాడ రవి, వైస్ ఎంపీపీ తలగాన శ్రీరాములు, మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వరరావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ మాధవరావు, సర్పంచ్ తామాడ మదన్, మాజీ సర్పంచులు సుధా, శంకర్, సీనియర్ నాయకులు దేవరకొండ షణ్ముఖరావు. జినగ సీతారాం, ఎస్.దానయ్య విద్యార్థి విభాగ అధ్యక్షుడు బమ్మిడి సంతు, సీనియర్ నాయకులు ఎస్ దానయ్య వికలాంగుల అధ్యక్షుడు దున్న బాలకృష్ణ,మండల కార్యదర్శులు పి.మాధవ్, ఎస్. తేజ, రాజు పండా, మోహన్ పండా, పలు గ్రామాల్లో స్థానిక పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ నిర్ణయంతో రైతులకు భూహక్కు

**-రాజముద్ర పాసు పుస్తకాలు ఎంతో మేలు - తెలుగుదేశం పార్టీ మండల అధ్యడు దుర్యోధన**


**మందస, జనవరి 5(వార్త):** కూటమి ప్రభుత్వ నిర్ణయంతో రైతులకు భూహక్కు కలుగుతోందని, రాజముద్ర పాసు పుస్తకాలతో ఎంతో మేలు జరుగుతుందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన అన్నారు. బాలిగాం పంచాయతీ రంగనాథ పురం గ్రామంలో గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా దుర్యోధన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రైతుల భూముల పట్టాదార్ పాస్ పుస్తకాల్లో జగన్మోహన్ రెడ్డి ఫొటోలతో సహా వైఎస్సార్ జగన్ మోహన్ రెడ్డి భూహక్కుపత్రాలని చెప్పి, ప్రతీ పేజీలో ఆయన ఫోటోలను ముద్రించి, వైసీపీ రంగులతో కూడిన పాస్ పుస్తకాలు రైతులకు పంపిణీ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజముద్రతో కూడిన ఏ విధమైన తప్పులు లేకుండా భూహక్కుదారులకు ఎవరి ఫోటోలు లేకుండా పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తామని మాట ఇచ్చారో ఆ మాట నిలబెట్టుకోవడం జరిగిందని తెలిపారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో అక్కడక్కడా తప్పులు ఉన్నట్లు మా దృష్టికి వచ్చిందని ఇవ్వన్నీ స్థానిక పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ద్వారా అధికారులతో మాట్లాడించి సరి చేయిస్తామని తెలిపారు. ఈ నెల రెండవ తేదీ నుంచి 9వరకు ప్రతి రెవెన్యూ గ్రామంలో గ్రామసభలు జరుగుతాయని, అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గ్రామ సభల్లో కూటమి నాయకులు, అధికారుల సమక్షంలో ప్రజలకు భూయజమాన్యపు హక్కు పాసు పుస్తకాలు పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధపడిందని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు చాలా ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాలిగాం పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మామిడి తాతారావు, పందిరి భాస్కరరావు, శ్రీను, బాలక్రిష్ణ, రామారావు, సూర్యనారాయణ, నల్ల జయశంకర్, గున్న విక్రమ్, విఆర్వో నాగేశ్వరరావు మల్లేన, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ,



సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషమ్మ ఆదేశాల మేరకు మీ భూమి, మీ హక్కు కొండలోగాం గ్రామ రైతాంగం ఆధ్వర్యంలో జరిపారు. గత ప్రభుత్వం వైసీపీ హయాంలో రైతు పాస్ పుస్తకాలలో జగన్మోహన్ రెడ్డి బొమ్మ వేసి, జగనన్న శాశ్వత భూహక్కు అని ఉండడంతో చూసి రైతులు ఆందోళనకు గురయ్యారని గ్రామసభలో గిరిజనులు అన్నారు. తాతలు, తల్లిదండ్రులు, మా కష్టార్జితంతో సంపాదించిన డబ్బులతో మేము భూమిని కొనుక్కుంటే, జగన్మోహన్ రెడ్డి ఫోటోని వేయటంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. చంద్రబాబు రాజముద్ర వేసి, పట్టాదారు పాస్ పుస్తకాలను రీ సర్వే జరిగిన ప్రతి గ్రామాల్లో రైతులకు, రాజముద్రలతో కూడిన రైతు పాస్ పుస్తకాలు పంపిణీ జరుగుతోందన్నారు. కార్యక్రమంలో యూనిట్ కన్వీనర్ ఎస్.ప్రశాంత్ కుమార్, వీఆర్వో తులసి దాసు, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, బాలకృష్ణ, రవిశంకర్, ఆనంద్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎఫ్ఏ-3 పరీక్షలను పరిశీలించిన ఎంఈఓ



**జలుమూరు, జనవరి 5(వార్త):** జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫార్మేటివ్ అసెస్మెంట్-3 పరీక్షలను ఎంఈఓ- 2 ప్రసాదరావు సోమవారం పరిశీలించారు. జోనంకి ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న పరీక్షల తీరును ఆయన పర్యవేక్షంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులలో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికి తీసేందుకు ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఈ పరీక్షల ద్వారా విద్యార్థుల విద్యా స్థాయిని అంచనా వేసి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోధన అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల పరీక్షలను భయపడకుండా ఆత్మవిశ్వాసంతో రాయాలని సూచించిన ఆయన, ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షల ఫలితాల ఆధారంగా బోధనా విధానాలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు.

## చెంచుల సంప్రదాయ కళావైభవం



**నరసన్నపేట, జనవరి 5(వార్త):** నరసన్నపేట పట్టణం మకర సంక్రాంతి పర్వదినాల సందర్భంగా సంప్రదాయ కళలతో కళకళలాడింది. సంక్రాంతి వేళ చెంచుల బృందం పట్టణ వీధుల్లో సంచరిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గుండివిల్లిపేట గ్రామానికి చెందిన చెంచులు, ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా పలు వేషధారణలతో అలంకరించుకొని తమ సంప్రదాయ ఆచారాలను ప్రదర్శించారు. సోమవారం పట్టణ పుర వీధుల్లో చెంచులు చేసిన నృత్యాలు, వారి జీవనశైలి ప్రతిబింబించే ప్రదర్శనలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రజలు వారిని సాదరంగా ఆహ్వానిస్తూ, ఆసక్తిగా నృత్యాలను తిలకించారు. చెంచుల సంప్రదాయ కళలు, ఆచార వ్యవహారాలు సంక్రాంతి పండుగకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. గ్రామీణ సంస్కృతి, ఆదివాసీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ కార్యక్రమం, నేటి తరం వారికి మన వారసత్వాన్ని గుర్తు చేసేలా నిలిచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఇలాంటి సంప్రదాయ కార్యక్రమాలు కొనసాగాలని పలువురు ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## పింఛను మంజూరు చేయాలని వినతి



**పోలాకి, జనవరి 5(వార్త):** 95 శాతం వికలాంగ ధ్రువీకరణ పత్రం ఉన్న తనకు ప్రభుత్వ పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని పోలాకి మండలం కింజరాపుపేటకు చెందిన కింజరాపు రాజు కోరారు. సోమవారం శ్రీకాకుళం పట్టణంలోని జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఆయన అధికారులకు ఫిర్యాదు చేశారు. కొత్త పింఛన్ కోసం గత ఐదు నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఫలితం కనిపించలేదని తెలిపారు. శారీరక వైకల్యం కారణంగా ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని వాపోయారు. అర్హతలు ఉన్నప్పటికీ పింఛను మంజూరు కాకపోవడంతో జీవన భారం పెరిగిందని పేర్కొన్నారు. తన పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని తక్షణమే పింఛను మంజూరు చేసి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన అధికారులను విజ్ఞప్తి చేశారు. అధికారులు ఫిర్యాదును స్వీకరించి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఉపాధి వేతనదారులకు 125 పని దినాలు

**జలుమూరు, జనవరి 5(వార్త):** ఉపాధి హామీ పథకం కింద వేతనదారులకు శుభవార్త లభించింది. ఉపాధి వేతనదారులకు ఏడాదికి పని దినాలను 100 రోజుల నుంచి 125 రోజుల వరకు పెంచుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి సుశీల తెలిపారు. సోమవారం జలుమూరు మండలం తిమడాం గ్రామ సచివాలయంలో సర్పంచ్ వెలమల సత్యవతి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పని దినాల పెంపుతో గ్రామీణ పేదలకు అదనపు ఉపాధి అవకాశాలు కలుగుతాయని, వారి జీవనోపాధి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. గ్రామసభలో ఏఎంసీ అధ్యక్షుడు వెలమల చంద్రభూషణం, ఎంపీటీసీ అసిరి నాయుడు తదితర ప్రజాప్రతినిధులు పాల్గొని ఉపాధి పనులను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఉపాధి వేతనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పని దినాల పెంపు నిర్ణయంతో ఉపాధి కూలీలు ఆనందం వ్యక్తం చేస్తూ, ఇది తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.



# కార్పొరేట్ల దోపిడీ కోసమే ఆపరేషన్ కగార్

### -ప్రభుత్వాలపై ధ్వజమెత్తిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ

### -ఘనంగా కామ్రేడ్ సవర చిలకమ్మ 30వ వర్ధంతి

### -కొండలోగాంలో రెపరెపలాడిన ఎర్రజెండా



**మందస, జనవరి 5(వార్త):** అటవీ సంపదను బహుళ జాతి సంస్థలకు కట్టబెట్టడానికే మోదీ, అమిత్ షా నేతృత్వంలోని మతోన్మాద బీజేపీ పాలకులు ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను, మావోయిస్టులను పెద్ద ఎత్తున చంపేస్తున్నారని, ఇది అత్యంత దుర్మార్గమైనదని సీపీఐ(ఎంఎల్ న్యూడెమోక్రసీ) జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు ధ్వజమెత్తారు. మందస మండలం కొండలోగాం ఆదివాసీ గ్రామంలోని సవర చిలకమ్మ(మంత్రిబుడి) స్తూపం వద్ద సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటీ చిలకమ్మ 30వ వర్ధంతి జరిగింది. న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు గొరకల బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మాధవరావుతో పాటుగా ఐఎఫ్టియు జిల్లా నాయకుడు జుత్తు వీరాస్వామి, పీఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సొర రామారావు, ఆదివాసీ నాయకుడు సవర బంగ్లాకుమార్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు మామిడి భీమారావు తదితరులు మాట్లాడుతూ విస్తారంగా ఉన్న అటవీ సంపదను, ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి కేంద్రంలో ఉన్న మోదీ, అమిత్ షా నేతృత్వంలో పాలకులు అదాని, అంబానీలకు అడవులను కట్టబెట్టడానికి సహజ వనరులను వారికి అప్పనంగా అప్పగించడానికి అందుకు అడ్డుగా ఉన్నఉద్యమకారులను, ఆదివాసీలను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపుతున్నారని మండిపడ్డారు. ప్రకృతి పర్యావరణానికి విఘాతం కలిగించి, పచ్చదనాన్ని సర్వనాశనం చేసే, ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశంలో అనేక మంది మేధావులు, ఉద్యమకారులు ప్రజాస్వామికవాదులు పోరాడుతున్నారన్నారు. కామ్రేడ్ సవర చిలకమ్మ సాధారణ ఆదివాసి కుటుంబంలో పుట్టి, శ్రీకాకుళ సాయుధ పోరాట కాలంలో పార్టీకు, దళాలకు కొరియర్ గా పనిచేశారని గుర్తు చేశారు. కామ్రేడ్ చిలకమ్మను స్మరించడం అంటే ఆమె అందించిన ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించడమేనని పిలుపునిచ్చారు. ఆదివాసీ గ్రామాలన్ని 5వ షెడ్యూల్లో చేర్చాలని, 1/70చట్టాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఆదివాసి ప్రాంతాలన్నీ నాన్ షెడ్యూల్ గా మిగిలి ఉన్నాయని, నాన్ షెడ్యూల్ ఆదివాసి గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలన్నారు. ఆదివాసీ ప్రాంతంలోని భూములు దురాక్రమణకు గురవుతున్నాయని ఆరోపించారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాల మీద పెద్ద ఎత్తున హిందూ మతం పేరుతో మనువాద పాలకులు దాడి చేస్తున్నారని, బలవంతంగా హిందూ మత సంస్కృతిలో భాగం చేస్తున్నారని, ఆదివాసుల అస్తిత్వాన్ని, వారి సంస్కృతిని, సాంప్రదాయాలను కాపాడాలన్నారు. అందుకు ప్రజా ఉద్యమాలే శరణ్యమని అన్నారు. పోరాడితేనే హక్కులు సాధించబడతాయని, ఆదివాసీలంతా సంఘటితమై అడవులను, అటవీ సంపదను కాపాడుకోవాలన్నారు. 5వ షెడ్యూల్ 1/70సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సార జగన్(పీవైఎల్), వంకల పాపయ్య, రాపాక మాధవరావు, అప్పయ్య, బర్ల గోపి, జానకమ్మ, దాసు, రాజారావు, పున్నయ్య, డొంబురు, చిలకమ్మ మనవడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శివనగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారం



**నరసన్నపేట, జనవరి 5(వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలోని శివనగర్ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను కాలనీ వాసులు స్థానిక వార్డు సభ్యుడు గొలివి రామారావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన పంచాయతీ విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, అధికారుల ఆమోదంతో సోమవారం నుంచి డ్రైనేజీ సమస్య పరిష్కార పనులు ప్రారంభమయ్యాయి. కాలనీలో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడేలా అవసరమైన మరమ్మతులు, నీటి ప్రవాహం సజావుగా ఉండేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని వార్డు సభ్యుడు హామీ ఇచ్చారు. స్థానికులు సమస్యపై స్పందించి చర్యలు చేపట్టినందుకు సంతృప్తి వ్యక్తం చేశారు.

## ఫైనల్ అసెస్మెంట్-3 పరీక్షలు ప్రారంభం



**నరసన్నపేట, జనవరి 5(వార్త):** విద్యాశాఖ ఆదేశాల మేరకు సోమవారం నుంచి ఫైనల్ అసెస్మెంట్‌ఉ3 పరీక్షలు నిర్వహిస్తున్నామని మండల విద్యాధికారి (ఎంఈవో) పేడాడ దాలినాయుడు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎంఆర్సీ కార్యాలయం నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షలకు ఒకటవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన మొత్తం 11,920 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు ఎంఈవో తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తున్నామని, పరీక్షలు సజావుగా సాగేందుకు పర్యవేక్షణ చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు.

## ఎంఈఓలకు సన్మానం



**ఇచ్ఛాపురం, జనవరి 5(వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉన్న ఆర్జెడి ,డి. ఈ. ఓ, డిప్యూటీ డి ఇ ఓ, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ లకు నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసే కార్యక్రమాన్ని చేపట్టారు.ఇందులో భాగంగా ఇచ్ఛాపురం మండలంలో ఉన్న ఎం ఈ ఓ -1 కే అప్పారావు , ఎం ఈ ఓ -2 ఎస్ విశ్వనాథం లకు సన్మానించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. కృష్ణమూర్తి రెడ్డి , శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు అప్పలాచారి , అమ్మబడి స్కూల్ (టెక్కలి) చైర్మన్ శ్రీనివాస్ ఇచ్ఛాపురం నియోజకవర్గం ప్రెసిడెంట్ సి.హెచ్. తులసిదాస్ రెడ్డి , సెక్రటరీ_. రామారావు ఇచ్ఛాపురం మండలం ప్రెసిడెంట్ పి.చిరంజీవి, సెక్రటరీ మార్కండేయులు , ఆదినారాయణ కలిసి సాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో నారాయణ పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఘనత



**పలాస, జనవరి 5(వార్త):** ధర్మశాల( హిమాచల్ ప్రదేశ్)లో డిసెంబర్ 12 నుండి 21 వరకు జరిగిన ఎన్ఎస్ఎస్ అడ్వెంచర్ క్యాంప్ 2025లో పాల్గొని క్యాంపు కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకుని వచ్చిన ఎస్.బి.ఎస్. వై.ఎం కళాశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ టి. ప్రవీణ కుమారి సోమవారం ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆరోగ్యం, పర్యావరణ రక్షణ, మహిళా సాధికారత, విపత్తు సహాయం, రక్త దానం, అవగాహన కార్యక్రమాలతో సమాజంలో మానవతా విలువలు పెంచుతున్నారని చెప్పారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఎచ్చెర్ల, శ్రీకాకుళం జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) విభాగం ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్ ఆదేశాల మేరకు అటల్ బిహారీ వాజ్ పేయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ యాల్లీడ్ స్పోర్ట్స్ ధర్మశాల హిమాచల్ ప్రదేశ్ వారు డిసెంబర్ 12 నుండి డిసెంబర్ 21 వరకు పది రోజులు పాటు ఎన్ఎస్ఎస్ అడ్వెంచర్ క్యాంప్ -2025ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ కళాశాలల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో పాటు స్థానిక ఎస్. బి.ఎస్. వై.ఎం కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-2 విద్యార్థులైన పోతనపల్లి మానస (బిఎస్సీ), బెహరా త్రిషా ( బిఎస్సీ) లు ఎన్నికై క్యాంపు కార్యక్రమాలలో దిగ్విజయంగా పూర్తి చేశారు. విద్యార్థుల ప్రగతి పట్ల ముగ్దులైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆర్.రజని, యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ, ఎస్. బి.ఎస్. వై.ఎం కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రవీణ కుమారి విద్యార్థులపై ప్రశంసల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ -1,2,3 ప్రోగ్రాం ఆఫీసర్స్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## యువత తమ జీవితాలను మలుచుకోవాలి

**పలాస, జనవరి 5 (వార్త):** రాష్ట్ర, జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ ఆదేశాలపై పలాస అధ్యక్షులు, పలాస మండల న్యాయ సేవా సంఘం,పలాస జూనియర్ సివిల్ జడ్జి, యు మాధురి అధ్యక్షులు మండల న్యాయ సేవా సంఘం, జూనియర్ సివిల్ జడ్జి, పలాస వారి సూచనలపై సోమవారం పలాస విద్యా వాహిని డిగ్రీ కళాశాలలో ప్రత్యేక న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఐదు జనవరి నుండి 12 జనవరి వరకు స్వామి వివేకానంద వారి జయంతి ఉత్సవాలలో భాగంగా జాతీయ యువజన ఉత్సవాలలో భాగంగా సోమవారం యువత యొక్క అభివృద్ధి డ్రగ్స్ నిరోధము అంశాలపై ఈ న్యాయవిజ్ఞాన సదస్సు మండల న్యాయ సేవా సంఘం పలాస నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా న్యాయవాదుల సంఘం అధ్యక్షులుమహమ్మద్ సయాజ్ అహ్మద్, వైస్ ప్రెసిడెంట్, పానల్ న్యాయవాది బి కామేశ్వరరావు పట్నాయక్, న్యాయవాది డాక్టర్_. లోకేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు, కరెస్పాండంట్ తిరుమలరావు, ఎ.వ. సంధ్యారాణి, అధ్యాపకులు, పాల్గొని, విద్యార్థిని - విద్యార్థులుకు అవగాహన కల్పించారు. యువత ఉన్నత విద్యలను అభ్యసించి మంచి మార్గంలో వారి జీవితాలను తీర్చిదిద్దుకోవాలని స్వామి వివేకానంద చెప్పిన విధంగా ఉక్కు కండరాలుతో కూడిన యువత దేశ అభివృద్ధికి మూల స్తంభాలని, అదేవిధంగా వ్యసనాలు, మత్తు పదార్థాలు లేదా మాదక ద్రవ్యాల బారిన పడకుండా యువత జాగ్రత్త పడాలని, అపరిచితుల ద్వారా ఇటువంటి మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు ద్వారా యువత వారి యొక్క భవిష్యత్తును కోల్పోతున్నారని సీనియర్ న్యాయవాది బి. కామేశ్వరరావు పట్నాయక్ తెలియజేశారు. డ్రగ్స్ వద్దు- ఆరోగ్యం ముద్దు, యువతే దేశానికి భవిత అనీ వక్తలు తెలిపారు. మత్తు వదిలితే జీవితంలో విజయవంతం అవుతారని, ఈ మాదకద్రవ్య వినియోగము లేదా ఇటువంటి మాటగ ద్రవ్యాలను కలిగి ఉండడం కూడా నేరమని, దానికి తీవ్రమైన జైలు శిక్షలు జరిమానాలు ఉన్నాయని, అపరిచిత వ్యక్తులు ఏవైనా ప్యాట్లు, పార్సిల్లు ఇచ్చి ఎవరికైనా అందజేయమంటే ఎటువంటి వాటిని తీసుకోవద్దని, విద్యార్థిని-విద్యార్థులు చక్కగా వారి జీవితాన్ని ఉన్నత విద్యను అభ్యసించి, క్రమశిక్షణను అలవాటు చేసుకుని, తద్వారా వారి జీవితాలలో ఉన్నత శిఖరాలను అందుకోవాలని వక్తలు తెలియజేశారు. చరవాణి ద్వారా విజ్ఞానం పొందాలని, మొబైల్ ఫోన్ ద్వారా చెడును గ్రహించారాదనీ, ఆన్లైన్లో అప్రమత్తం గా ఉండాలని విద్యార్థులకు చెప్పారు.



## కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యం

### -రైతులకు అన్ని విధాలా సాయం

### -రాజముద్రతో పాసు పుస్తకాలు

### -పలాస ఎంఎల్ఏ గౌతు శిరీష



**మందస, జనవరి 5(వార్త):** కూటమి ప్రభుత్వంతోనే సంక్షమం సాధ్యమని, రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా సాయం చేస్తోందని పలాస నియోజక వర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీష అన్నారు. మందస మండలంలోని దున్నవూరులో జరిగిన మీ భూమి మీ హక్కు గ్రామసభ హాజరై, ప్రసంగించారు. రాజముద్ర పాసు పుస్తకాలతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం చేసిన ప్రచార ఆర్భాటాలతో రైతులు వద్ద ఉండాల్సిన పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ బొమ్మ ముద్రించారన్నారు. వైసీపీ ప్రభుత్వం రైతుల భూములకు సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాల్లో జగన్మోహన్ రెడ్డి ఫోటోలతో భూహక్కుపత్రాలని చెప్పి, ప్రతీ పేజీలో ఆయన ఫోటోలను ముద్రించి, వైసీపీ రంగులతో కూడిన పాస్ పుస్తకాలు రైతులకు పంపిణీ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజముద్రతో కూడిన ఏ విధమైన తప్పులు లేకుండా భూహక్కుదారులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తామని మాట ఇచ్చిన అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా మాట నిలబెట్టుకోవడం జరిగిందన్నారు. అక్కడక్కడా తప్పులు ఉన్నట్లు మా దృష్టికి వచ్చిందని, వీటిని అధికారులతో మాట్లాడించి సరి చేయిస్తామని తెలిపారు. ప్రతీ రెవెన్యూ గ్రామంలో గ్రామసభలు జరుగుతున్నాయని, అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బావన దుర్యోధన, జిల్లా కార్యదర్శి దాసరి తాతారావు, బాలిగాం, మందస పీఏసీఎస్ ల ఛైర్మన్లు లబ్బ రుద్రయ్య, తమిరియా భాస్కరరావు, పార్టీ నాయకులు బమ్మిడి కర్రయ్య, సాలిన మాధవరావు, ముడిమించి నవీన్ కుమార్ యాదవ్, ఏఎంసీ ఛైర్మన్ మల్లా శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ కింతలి రామకృష్ణ, కూటమి నాయకులు, రైతులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్‌తో మేలు



**మందస, జనవరి 5(వార్త):** వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్ పథకంతో వేతనదారులకు మేలు జరుగుతుందని మందస ఎంపీడీఓ వై.వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంగా కేంద్రం మార్పు చేసిందన్నారు. ఈపథకాన్ని వీబీ జీ-రామ్ జీగా మార్చిన నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించాలని కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలిచ్చిందన్నారు. పథకంలో మార్పులను అధికారులు వివరించారు. నాలుగు అంశాలకు సంబంధించి పనులకు అధిక ప్రాధాన్యం ఉంటుందని, జలసంరక్షణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, జీవనోపాధుల కల్పన, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే పనులు. గ్రామాల అభివృద్ధి ఎక్కువగా ఉపాధి హామీ పథకం పైనే ఆధారపడి ఉంటోందని, దీనిలో భాగంగా కొత్తగా 266పనులు చేపట్టేందుకు మార్గం సుగమం కానుందన్నారు. సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు కొత్త భవనాల నిర్మాణం నిధులతోనే చేపట్టనున్నామన్నారు. బంజరు, బీడు భూముల్లో పండ్ల తోటలు, మొక్కల పెంపకంతో పాటు పండ్ల తోటలు, వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణానికి ఈ కొత్త పథకం ద్వారా నిధులు మంజూరుకానున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో దీర్ఘకాలిక ఆస్తులు కల్పించబడటాయని, 100రోజుల నుంచి 125 రోజులకు పెంచడం జరిగిందన్నారు. నిరుద్యోగ భృతి హక్కు కల్పించడం, కూలీలకు సమయానికి వేతనాలు చెల్లింపు జరిగేటట్టు చూడడం, ఆలస్యమైన వాటికి పరిహారంతో కూడిన వేతనాలు చెల్లిస్తారన్నారు. పనుల ప్రణాళికను గ్రామస్థాయిలోనే గ్రామ ప్రజల భాగస్వామ్యం తో నిర్ణయించడం జరుగుతుందని, పనులు నాలుగు కేటగిరీలుగా గుర్తించడం జరుగుతుందని, నీటి భద్రత,జల సంరక్షణ పనులు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక మౌలిక వసతుల అభివృద్ధి, జీవనోపాధి కల్పించే వసతులు, ప్రకృతివైపరీత్యాలను ఎదుర్కొనే పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ చట్టం కింద గ్రామస్థాయిలో చేపట్టే అన్ని పనులను వికసిత్ భారత్ గ్రామపంచాయతీ ప్రణాళికలో నమోదు చేస్తారని, అన్ని శాఖల మధ్య సమన్వయం పెరుగుతుందని, అవినీతిని అరికట్టవచ్చన్నారు. విత్తనాలు వేయడం, కోతకు సంబంధించిన ప్రధాన వ్యవసాయ పనుల కోసం 60 రోజులు కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించవచ్చన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో కూడా గ్రామసభలు జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.వెంకటరమణతో పాటు డిప్యూటీ ఎంపీడీఓ తిరుమలరావు, ఏపీఓ బీవీ హరికృష్ణ, ఈసీ చింతా సురేశ్ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుకు గడువు పొడిగింపు

### -8 వరకు అవకాశం

**జలుమూరు, జనవరి 5 (వార్త):** ఏపీ మోడల్ స్కూల్, కరవంజలో గెస్ట్ టీచర్ల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ గడువును జనవరి 8 వరకు పొడిగించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. పాఠశాల కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఈ విద్యా సంవత్సరానికి పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (గ్రా+టు) పోస్టులను గెస్ట్ ఫ్యాకల్టీ ద్వారా భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నియామకాల్లో భాగంగా పీజీటీ సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్ విభాగాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత పీజీలో కనీసం 50 శాతం మార్కులు మరియు బీఈడీ అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి వివరాలతో తమ దరఖాస్తులను జనవరి 8వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా సమర్పించాల్సిందిగా సూచించారు. దరఖాస్తులు పరిశీలించిన అనంతరం సెలక్షన్ కమిటీ ద్వారా డెమో నిర్వహించి, తుది జాబితాను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12,000 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు ఆయన వెల్లడించారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల యాజమాన్యం కోరింది.

## ఆరోగ్యమే సంపద : డాక్టర్ సునీల్




**పలాస, జనవరి 5 (వార్త):** మనిషి ఆరోగ్యంగా ఉంటేనే కోటి రూపాయల సంపదతో సమానమని రెంటికోట ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం డాక్టర్ సునీల్ అన్నారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా సోమవారం కార్యక్రమం సున్నాడ గ్రామంలోని మండల ప్రజా మోడల్ ప్రైమరీ స్కూల్‌లో వహించారు. ముఖ్యఅతిథిగా ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు చెందిన డాక్టర్ సునీల్ హాజరై ప్రత్యేక వైద్య శిబిరాన్ని సున్నాడ గ్రామంలో స్థానిక ప్రజలకు సుమారుగా 90 మంది వరకు వైద్య పరీక్షలు చేసి వారికి ఔషధాలను ఉచితంగా పంపిణీ చేసినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిశుభ్రమైన చేతులు చర్మ వ్యాధులు, దురద, చికాకు, బొబ్బలకు కారణమవుతాయని, పగిలిన చర్మం ద్వారా బ్యాక్టీరియా సులభంగా ప్రవేశించి సంక్రమణలు పెరుగుతాయని అన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కోవాల్సిన ఆరు విధానాలను వివరించారు. చేతులు శుభ్రంగా ఉంచుకోకపోతే కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు. ప్రత్యేకంగా బాలికలకు రక్తహీనత పరీక్షల ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించవచ్చని తెలిపారు. భోజనం చేసేటప్పుడు మధ్యలో ఆహారం గొంతులో ఇరుక్కుంటే దానిని తొలగించే విధానం, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే సీపీఆర్ (సిపిర్) విధానాన్ని వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సున్నాడ గ్రామంలోని మండల ప్రజా మోడల్ ప్రైమరీ స్కూల్ పరిసర ప్రాంతాల్లో చెత్త మొక్కలను తొలగించి, చెత్తను పూడ్చి పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహనతో పాటు స్వచ్ఛతపై బాధ్యతాభావం పెరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి మధు, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు ఎన్ ఎస్ ఎస్ వాంటిర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ముచ్చింద్రకు రోడ్డు సౌకర్యం

**ఇచ్ఛాపురం, జనవరి 5 (వార్త):** ముచ్చింద్ర గ్రామంలో సాడి జగన్నాథం ఇంటి నుండి నీలగిరి కృష్ణ సాహు ఇంటి వరకు 90 మీటర్లు రోడ్డుని ఏడు లక్షల వ్యయంతో కూటమి ప్రభుత్వం నాయకులు సమక్షంలో భూమి పూజ చేసి రోడ్డు పనులు చేపట్టారు.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమ గ్రామంలో సుమారు 18 నెలల్లో కోటి రూపాయలతో రోడ్లు వేయడం పట్ల గ్రామ ప్రజలు ఎంతో సంతోషపడుతున్నారు. పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పనితీరు చూసే పంచాయతీలో ప్రజలందరూ కూటమి ప్రభుత్వానికి హర్షం వ్యక్తం చేస్తున్నారని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తిప్పన దుర్యోధన రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు జనసేన నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



